# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

November / నవంబర్-2024

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

- ఋగ్వేద సంహిత

# శాంతి

## SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 100 November / నవంబర్–2024 No./ సంచిక : 11

| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – హరివంశము | 2 |
| 2. | ధ్యానము – శివమానసిక పూజాస్తుతి | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | ఆనంద రామాయణము – పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 10 |
| 5. | గురువాచకకోవై – మురుగనార్ | 14 |
| 6. | మానసోల్లాసము – శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 16 |
| 7. | అనిరుద్ధకృత ఆర్యాస్తోత్రం – హరివంశ పురాణమ్ | 21 |
| 8. | అరుణాచల దీపోత్సవము | 24 |
| 9. | కార్యక్రమములు – విరాళములు | 25 |

**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/– లు సాలుసరి రూ. 100/–**



# ప్రార్థన

**తీవ్రధ్యానంలో ఇంద్రియాలు కట్టుబడతాయి**

శ్లో॥ **నవినాశఙ్కరం విష్ణుః నవినా కేశవం శివః**
**తస్మాదేకత్వమాయాతా రుదేప్రేన్ద్రే తుతౌపుణ**
**నమో రుద్రాయ కృష్ణాయ నమస్సంహతచారిణే**

తా॥ శంకరుడు లేకుండగా విష్ణువు ఉండడు. విష్ణువు లేనిదే శివుడూ లేడు. కావున మొదటే రుద్ర ఉపేంద్రుడులు ఒకటిగా అయివున్నారు. రుద్రునికి నమస్కారము. శ్రీకృష్ణునికి నమస్కారము. కలసి సంచరించు వారిరువురికే నమస్కారము.

# ధ్యానము

శ్లో॥ **ముషితస్మరావలేపే**
**మునితనయా యుర్వదాన్య పదపద్మే॥**
**మహసి మనోరమతాంమే**
**మహతి దయాపూర మేదురా పాఙ్గే**

తా॥ కాముని గర్వాతిశయమును కాలరాచిన వెలుగులో–మార్కండేయున కమితాయుర్దాయము ననుగ్రహించిన మహస్సులో–కరుణారసముట్టిపడు కడగంటి చూపులున్న కాంతిపుంజములో నామానసము రమించుగాక!

**–శివమానసిక పూజాస్తుతి**

మీరు మీ ధనమును మీ స్నేహితుని చేరుకొనుట లేదా శత్రువుగా చేసికొనుట మీ చేతులలోనే యున్నది. మీరు దైవచింతనతో నిస్వార్థ సేవలో మీ ధనమును వెచ్చించిన అది స్నేహపాత్రయగును. అట్లుగాక మీ స్వార్థమునకై వినియోగించిన అది శత్రువుగా పరిణమించును. **–స్వామి ఓంకార్**

తన స్థానాన్ని గుర్తించుకోవడానికి ప్రతిమానవునికి సమాన స్వాతంత్ర్యముండాలి. నీ తల నీ యిష్టము వచ్చినంత ఎత్తులో వుంచుకో. కాని నీ పాదాలనెప్పుడు నేలమీదనే వుంచు. దుర్బలుడైన, యిష్టపడ్డ, ఇంకొకరి భుజాల మీద, మెడమీద ఎప్పుడూ పెట్టవద్దు సుమా! **–స్వామి రామతీర్థ**

ధనవంతులు కారు శీలవంతులు నిజంగా సుఖిస్తారు. ఆత్మోన్నతికి ఉపకరించని ధనం, బలం, విద్య నిరర్థకము. శీలవంతుని వైభవం ఎన్నటికి క్షీణించదు.

**–భగవాన్ రమణమహర్షి**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తర్వాత) **అధ్యాయం - 56**

## కైలాస ఆశ్రమము – మౌనంగా కొన్ని సంవత్సరాలు

నేను రాస్తున్న ఆత్మకథని కోటగిరిలో నెలకొనివున్న శాంతికేంద్రములో వ్రాసి పూర్తిచేస్తే బాగుంటుందని సోదరి శాంతి ప్రతిపాదించింది. నేను అంతకు పూర్వమే అక్కడ కొన్ని అధ్యాయాలు ఆ అందమయిన, ఆరోగ్యకరమైన కేంద్రంలో వ్రాశాను. మేము నీలగిరికొండల్లోని శాంతి కేంద్రానికి వెళ్ళడానికి సమాయత్తమవుతుండగా, పూజ్య రామానంద తీర్థ గారు హిమాలయాల్లోని తెహ్రీలోని శ్రీ రామతీర్థ జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపాన్ని ఆవిష్కరించడానికి ఆహ్వానించారు. అక్కడే శ్రీ రామతీర్థ స్వామీజీ పవిత్రమయిన గంగానదిలో తమ భౌతికదేహాన్ని త్యజించారు. ఈ స్తూపాన్ని ఆవిష్కరించటము అంటే అది నా జీవితానికి ధన్యతను చేకూర్చేపని. నాకు ఎంతో ఇష్టమయినది. శ్రీ రామతీర్థగారు అంటే నాకు బాల్యం నుండి ఎంతో ఇష్టం. ఆయన జీవితము, వారు రచించిన గ్రంథాలు ఆయన చేసిన అద్భుత కార్యాలు నన్ను ఎంతగానో ప్రభావితము చేశాయి. ఆయన చాలా గొప్ప కవి, సాధు మహనీయుడు, పంజాబీ, ఆయన తన మాతృదేశం అయిన భారతదేశాన్ని పవిత్రమయిన అభిలాషను ఎంతో ప్రేమించాడు.

మేము హిమాలయాలకు బయలుదేరేముందే నాలుగు రోజుల ముందు శ్రీ రామతీర్థ శాంతి ఇనిస్టిట్యూట్ విద్యార్థులను వెంటబెట్టుకొని వాల్తేరు ఆశ్రమాన్ని చూడడానికి వెళ్ళాము. రిషికొండ బీచ్ దగ్గర కొంత పని చేసుకున్న తర్వాత మేము కైలాసగిరి కొండ ఎక్కాము. అక్కడ నేను 1951 నుండి 1957 వరకు ఆరు సంవత్సరములు మౌనదీక్షలో గడిపాను.

కైలాసగిరి పర్వతముపైనుండి చూస్తూ ఎల్లలు లేని నీలిరంగు సముద్రము మూడువైపులా, ఒకవైపు పర్వతాల వరసలు కనిపిస్తూ కనువిందు చేస్తుంటే నా మనస్సు ఎంతో ఆనందించింది. కొన్ని మిలియన్ల నక్షత్రాలు ఆకాశం నిండా పరుచుకొని నన్ను ఈ ఆత్మకథని పూర్తి చేయడానికి ప్రేరణనిస్తున్నట్లుగా ఉన్నాయి. ఆశ్రమవాసులు, శ్రేయోభిలాషులు, భక్తుల కోరిక నెరవేర్చమని చెపుతున్నట్లుగా ఉన్నాయి.



ఈ పవిత్రమయిన రోజున, తెల్లవారుజామున, ఎంతో గొప్ప సంతోషంతో, ఆనందంతో, సంతృప్తిగా వెలుతురు సరిగ్గా లేకపోయినా నేను ఈ అధ్యాయం వ్రాయటం మొదలుపెట్టాను. కైలాసగిరిపైన ఎలక్ట్రిక్ దీపాలు లేవు. అందువలన నేను కిరసనాయలు దీపాన్ని వాడేవాడిని. ఈ ప్రపంచంలోకెల్లా నేను చాలా గొప్ప ధనవంతుడిగా భావించాను. ఎందుకంటే తెల్లవారుజామునే నిద్రలేవటం వలన నా వద్ద చాలా సమయం ఉంది. నాతోపాటు వచ్చిన విద్యార్థులందరు ఇంకా గాఢమయిన నిద్రలో ఉండగా, నా ప్రక్కన నాకు ఎంతో విశ్వాసపాత్రమయిన కుక్క 'రామి' నాకు తోడుగా ఉండగా నావైపు చూస్తూ త్వరగా నా ఆత్మకథని పూర్తిచేయమని ప్రార్థిస్తున్నట్లుగా ఉంది. పెన్ను తీసుకుని వ్రాయటం మొదలుపెట్టాను. చివరికి జంతువు అయిన 'రామి' కూడా దానిని పూర్తిచేయమని చెపుతుంటే మిగిలిన అధ్యాయాలు తొందరగా పూర్తిచేయాలని అనిపించింది.

ఇవన్నీ ప్రక్కనపెడితే, అసలు ఆత్మకథని వ్రాస్తున్నది ఎవరు? ఇదంతా ఆయనే వ్రాస్తున్నాడు. ఒకే ఒక్కరు వ్రాయగలరు. అందరిలో నెలకొని ఉండే ఆ ఒక్కటే అతడు. ఆయనే వ్రాస్తున్నప్పుడు, వైభవమంతా ఆయనకే చెందుతుంది. నేను అనేక ఆశ్రమాల పనుల వత్తిడిలో ఉన్నాను. తోటపల్లి కొండలు, వాల్తేరు, కైలాసగిరి, కోటగిరి శాంతి కేంద్రము మొదలైన ఆశ్రమ వ్యవహారాలు చూడటంతో పాటు ఇంకొక నిత్యమయిన ఇబ్బంది ఏమిటంటే నేను గతంలోనికి, దాదాపుగా ఇరవై లేదా ముప్ఫై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి అప్పటి వ్యక్తులను ఆనాటి సంఘటనలను తవ్వి తీయవలసి వస్తోంది. ఈ రోజుల్లో నేను గతాన్ని మర్చిపోయి ఈ క్షణంలో జీవించడానికి ఇష్టపడతాను. కైలాసగిరిలోని ప్రధానమైన భవన సముదాయములోని ఒక పెద్ద హాలులో కూర్చొని ఇప్పుడు నేను వ్రాస్తున్నప్పుడు, నా ఎదురుగుండా ఉన్న గోడమీద ఉన్న గుర్తు నన్ను ఎంతో ప్రభావితం చేస్తోంది. ఆ గుర్తులోని సందేశము నా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. అది కేవలం ఒకే ఒక్క పదము. కాని అది జీవితాన్ని మంచిమార్గములో నడిపిస్తుంది. జిజ్ఞాసువులకు, సాధకులకు, సత్యాన్వేషకులకు ఆధ్యాత్మిక బలాన్ని చేకూరుస్తుంది. వారు తూర్పు దేశాలవారయినా లేదా పశ్చిమదేశాలవారయినా సరే. ఆ సందేశము ఈ క్షణంలోనే, వర్తమానంలో జీవించేవారు ఆశీర్వదించబడతారు. గతాన్ని వదలిపెట్టాలి. భవిష్యత్తు నీ చేతిలో లేదు. అది అనిశ్చితము. కనుక ఈ క్షణంలో వర్తమానంలో జీవించాలి.

ప్రతిక్షణము, అనుక్షణము పైపైకి రావటానికి ప్రయత్నించి ఉన్నతమయిన స్థితికి చేరుకోవాలి. చివరికి మానవుని జీవిత గమ్యము చేరుకోవాలంటే ప్రతిక్షణాన్ని, వర్తమానాన్ని సాధ్యమయినంత చక్కగా సద్వినియోగం చేసుకోవాలి.

'వర్తమానము' మీద చక్కని కవిత నాకు చాలా ఇష్టము. దానిని మీకోసం ఇక్కడ పొందుపరచాలనుకుంటున్నాను.

**ఈరోజు**

ప్రతి సూర్యోదయము వలన మీ జీవితము ప్రారంభమయినట్లుగా భావించు.
గతము అయిపోయింది కనుక దానిని లోతుగా పాతిపెట్టు
గడిచిపోయిన రోజులన్నింటిని వాటిని నిద్రలోకి జారిపోనీయి
నిన్ను నీవు 'ఈరోజు'కి చెందినవాడిగా గుర్తించు
అర్థం చేసుకో, నీ మనస్సుకు తెలియచెప్పు, తలవంచు
ప్రణాళికలు సిద్ధం చేసుకో, సమయం ఆసన్నమయింది
'ఈ రోజు' మానవునికి మంచి స్నేహితురాలు
'నీవు' 'ఈ రోజు' నీ ఆత్మను శుద్ధి చేసుకో
ఈ సమయం చాలా అమూల్యమయినది
ఆ పరమాత్మతో అనుబంధాన్ని పెంచుకో
ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్ళిపో, సాధించు దాన్ని సాధించు.

## ఈ క్షణంలోనే చేయి

నేను ఈ దారిలో ఒక్కసారే రాగల్గుతాను అనుకుంటున్నాను. అందువలన నా వలన ఏదయినా మంచి పని జరిగితే, ఇతర మానవాళికి నా వల్ల ఏదయినా దయాగుణము చూపించగల్గితే, మేలు జరిగితే, దానిని నేను ఇప్పుడే, ఈ క్షణంలోనే చేయాలనుకుంటున్నాను. దానిని నిర్లక్ష్యం చేయడం గాని, దాని నుండి మరలి పోవడం గాని చేయను. ఎందుకంటే మళ్ళీ ఈ దారిలో నేను రాగలనో లేదో తెలియదు కదా!

ఇప్పుడు ప్రశాంతంగా, అందంగా ఉన్న కైలాసగిరి పైన కూర్చుని ఉన్నాను. చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంది. అక్కడి భవనాలు, గోడలు, పక్షులు, చెట్లు,



మొక్కలు అన్నీ కూడా శాంతి ఆశ్రమానికి భగవాన్ శివుని నివాస స్థలమయిన కైలాసగిరి స్వర్గసీమ లాంటి పవిత్రస్థలాన్ని భగవంతుడు ఏ విధంగా అందేవిధంగా పరిస్థితులు సృష్టించాడో పాఠకులకు తెలియచేయమని ప్రార్థిస్తున్నాయి. సత్యాన్వేష కులకు, తూర్పు పడమర దేశాల్లోని భక్తులకు, సాధకులకు ఆధ్యాత్మిక సాధనకు అది ఎంతగానో ఉపయోగపడింది.

అన్నింటికన్నా సంతోషకరమయిన విషయం కైలాసగిరిగురించి ఇప్పుడు మీతో పంచుకోవాలని ఉంది. భగవంతుని ఆశీస్సుల వలన ఇక్కడే నేను ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలము కేవలము ప్రార్థనలు, ధ్యానములోనే కాకుండా పూర్తి మౌనంలో గడిపాను. నేను ఎల్లప్పుడూ జ్ఞానేశ్వరికి కృతజ్ఞుడనై ఉంటాను, ఎందుకంటే ఆ సమయంలో ఆమె నా గురించి ఎంతో శ్రద్ధతో జాగ్రత్తగా చూసుకుంది. ప్రతిరోజు ఆమె వాల్తేరు ఆశ్రమము నుండి కైలాసగిరి కొండపైకి వర్షంలో తడుస్తూ అలాగే మండుటెండలో కూడా కొండ ఎక్కి నడచి వచ్చేది. నాకోసం భోజనము, ఇతర అవసరమయిన వస్తువులు తీసుకువస్తుండేది. స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆమె భక్తి శ్రద్ధలకు ముగ్ధులయిపోయేవారు. ఆమె పక్షిలాగా ఎంతో సంతోషంగా, సునాయాసంగా ఎగురుతూ కైలాసగిరి కొండశిఖరానికి చేరుకునేది. నేను ఆరు సంవత్సరాలు మౌనంగా ఉన్నా ఆ సమయంలోనే మేము శాంతి ఆశ్రమాల్లో అలాగే వాల్తేరు ఆశ్రమంలో ఎన్నో ముఖ్యమయిన పనులు ఆశ్రమ అభివృద్ధి కోసం చేయగలిగాము. వాల్తేరు ఆశ్రమంలో ముద్రణాలయం నెలకొల్పాము. అలాగే శాంతి పత్రికను వెలువరించటం ద్వారా భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో గొప్ప సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాము. ప్రత్యేకంగా విశాఖపట్టణం తదితర దగ్గర ప్రాంతాలవారికి చాలా ఉపయోగకరంగా చేశాము.

భగవంతుని అనుగ్రహం వలన, అన్ని ప్రాంతాల నుండి భక్తుల ప్రార్థనల మూలంగా 'మౌనపు ఘడియలు' అనే పుస్తకము కైలాసగిరిపై మౌనంలో నాకు కల్గిన ఆధ్యాత్మిక అనుభవాల గురించి వ్రాసినది ప్రచురించడం జరిగింది. అందులోని అధ్యాయాలు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లో ప్రచురించాము. కాని ఇంకా చాలా అధ్యాయాలు రెండు పెద్ద మడతల్లో ఉండిపోయాయి. అవి కనీసం ఇంకొక రెండు పుస్తకాలు అయిఉండేవి. వాటిని మర్చిపోయినందుకు చాలా విచారంగా ఉంది. ప్రతిరోజూ భగవంతునిపై భారం వేసి శాంతి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాము. అందువలన మాకు ఇంకా ఇతర గ్రంథాలను ప్రచురించడానికి సమయం గాని,

ధనం గాని అందుబాటులో లేవు. అందువలన వాటిని దేవునికే వదిలేసి సరయిన మంచి సమయం ఆసన్నమయినప్పుడు ఆ గ్రంథాలు ప్రచురించబడి తూర్పు పడమర దేశాల్లోని సత్యాన్వేషకులందరికి అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నాను.

కైలాసగిరి నుండి మిలిటరీ వాళ్ళు వెళ్ళిపోయిన మరునిముషము నుండే గూండాలు, నీచులు, మూర్ఖులు, రౌడీలు వాళ్ళ పని మొదలుపెట్టి, కరెంటు బల్బులు, వైర్లు, ఇంకా అనేకమయిన విలువయిన వస్తువులు తేలికగా మోసుకోపోలేని వాటిని కూడా దొంగిలించారు. తాళాలు పగలగొట్టి, చివరికి తలుపులు కూడా పీక్కుని తీసుకుపోయారు. కైలాసగిరి ఆశ్రమాన్ని సంరక్షించుకోవడం కోసం మేము ఒక తోటమాలిని ఏర్పాటు చేశాము. అయితే అతను ఒంటరిగా అక్కడ నివసించడానికి ఇబ్బంది పడుతుంటే, ఇంకో తోటమాలి కుటుంబాన్ని కూడా అక్కడ ఉండడానికి ఏర్పాము చేశాము. మాతృఆశ్రమంలో, ఇంకా అనేకమయిన ఇతర శాఖల్లో అనేకమయిన పనుల వత్తిడి ఉండడం వలన నేను ఎక్కువగా కైలాసగిరి ఆశ్రమంలో ఉండటం కష్టమయింది. అందువలన కైలాసగిరిపై మౌనంగా ప్రార్ధనలు, ధ్యానములో ఒంటరిగా సాధనలు చేసుకునే సాధువు, సన్యాసి కోసం ప్రయత్నించాము. బుద్ధి కోతి వంటిది కనుక సాధువుని అయినాసరే అది స్థిరంగా ఉండనీయదు. ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించే పవిత్రమయిన ఆత్మస్వరూపులు కూడా ఏదో ఒక స్థలంలో ఏకాంతంగా మౌనంలో శాంతిగా ధ్యానప్రార్ధనలు చేసుకోవటం చాలా కష్టమయిన విషయం. స్వామి బోధానందజీ అనే గొప్ప మహనీయుడు దాదాపు పదకొండు నెలలు కైలాసగిరి ఆశ్రమంలో మౌనంగా ధ్యానప్రార్ధనల్లో కాలము గడిపాడు. ఆయన ధ్యానములో ఉండగా ఒక పులి అక్కడికి వచ్చి అదే భవంతిలో ఒక ప్రక్క విశ్రాంతిగా పడుకునేది. ఆ సాధుమహాత్ముడికి, దానికి ఎలాంటి భయము కలిగేది కాదు. తర్వాత కొందరు వేటగాళ్ళు, అనవసరంగా ఆ పులిని తుపాకితో కాల్చి చంపివేశారని తెలిసి చాలా బాధపడ్డాను. భగవంతుడు ఆ నేరగాళ్ళను దయతో క్షమించుగాక! ఆ పులి ఆత్మకు దైవము శాంతిని ప్రసాదించుగాక!

ఇప్పుడు మేమే లేనప్పుడు కైలాస ఆశ్రమము ఇంకా ఇంకా శిథిలావస్థకు చేరుకోసాగింది. స్వామి రామానంద తీర్థగారు ఆశ్రమానికి ఎంతో శ్రేయోభిలాషులు. వారు కూడా ఆశ్రమంలో ఒక భాగం వంటివారు. అప్పుడప్పుడు కైలాస ఆశ్రమాన్ని సందర్శించి వస్తుండేవారు. శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు ఆశ్రమానికి అధ్యక్షులు.



అలాగే నా చిన్ననాటి స్నేహితుడు కూడా ఆశ్రమాన్ని సందర్శించి, తన పలుకుబడిని వినియోగించి ప్రభుత్వం నుండి కొంత సహాయసహకారాలు పొందటానికి ప్రయత్నించాడు. అదేవిధంగా ఎందరో భక్తులు వారి ప్రయత్నాలు చేశారు. ఇక ఇప్పుడు డా.కె.రామకృష్ణారావు గారు ఆంధ్రా విశ్వవిద్యాలయము, మానసిక శాస్త్రము డిపార్టుమెంట్, అలాగే వారి సహోద్యోగులు డా॥కె.సచ్చిదానందమూర్తి గారు కూడా ఎంతో శ్రద్ధగా కైలాసగిరిపైన పారా సైకాలజి ఇనిస్టిట్యూట్ ప్రారంభించి విద్యార్థులకు ధ్యానము, తపస్సు వల్ల కలిగే ప్రయోజనాలను తెలియచేయాలనుకున్నారు. మ్యానిచ్ విశ్వవిద్యాలయానికి చెందిన డా॥పరమాత్మ ప్రకాశ్ గారు, నేను కైలాసగిరిపైన మౌనదీక్షలో ఉన్నప్పుడు మొదట దర్శించుకున్నారు. ఇప్పుడు వారు కూడా కైలాసగిరి పైన ఒక కుటీరాన్ని సాధువులు ఉండడానికి లేదా జిజ్ఞాసువులైన సాధకులు మౌనంగా సాధన చేసుకొనే నిమిత్తం నిర్మించి ఇస్తానని వాగ్దానం చేశారు.

శివుడు కైలాసానికి అధిపతి కనుక, ఆయన ఎన్నటికి అంత అందమయిన స్వర్గం లాంటి ఆశ్రమాన్ని శిథిలమయిపోనీయడని నా అభిప్రాయం. ఎవరో ఒకరి రూపంలో తిరిగి ఆశ్రమాన్ని బాగు చేసుకోవడానికి ఒక పరికరంలాగా వినియోగిస్తాడని భక్తుల విశ్వాసం. అదే జరిగితే నా అభిలాష, సంకల్పం కూడా నెరవేరి కైలాసగిరి ఆశ్రమము శాంతికి నిలయంగా, సత్యాన్వేషకులకు, సాధకులకు శాంతిని, ఆనందాన్ని, సత్యదర్శనాన్ని అందిస్తుంది.

ఈ భౌతికమయిన శరీరాలు నిశ్చయంగా కనుమరుగు అయిపోతాయి. కానీ భగవంతుని బిడ్డలకి మనము ఏదయితే సేవలు చేస్తామో అవి మాత్రము శాశ్వతంగా, చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి పేరు శాశ్వతంగా ఉంటుంది. సమస్త మానవాళి శ్రేయస్సు ఆశించి సేవలు చేసేవారి జీవితాలు ధన్యమగుగాక!

నేను కైలాసగిరిపై చాలా కాలము సంతోషంగా మౌనంలో ఉన్నప్పుడు తూర్పు పడమర దేశాల్లోని భగవంతుని బిడ్డలందరూ శాంతిగా ఉండాలని కోరుకున్నాము. ఆ సమయంలో ఎందరో పేరు ప్రఖ్యాతులు గడించిన వారు అందమయిన ఆ పర్వత శిఖరాన్ని అధిరోహించి వచ్చేవారు. ఆ ప్రదేశంలోని అందాలను, శాంతిని నేను మాటల్లో వర్ణించి చెప్పజాలను. ప్రతిరోజు ఉదయకాలములో అది నిజంగా స్వర్గలోకపు ఆనందంలా, భగవంతుని కానుకలాగా నీలిరంగు సముద్రమునుండి సూర్యోదయాన్ని తిలకించటము, సాయంసంధ్య వేళల్లో ఎర్రని అగ్నిగోళం లాంటి

సూర్యుడు కొండల్లోకి దిగిపోవటము, ఈ క్రిందిగా విశాఖపట్టణము నగరము చూడటానికి ఎంతో అందంగా ఉండేది. నిశ్శబ్దమయిన నిశీథి వేళలో నగరంలోని దీపాలన్నీ మసకబారిపోయిన వేళ పైన ఆకాశంలోని నక్షత్రాలు ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ నన్ను వాటిలో కలిసిపోమని పిలుస్తున్నట్లుగా ఉండేది. అలాంటి అద్భుతమయిన దృశ్యాలు నన్ను మానవ సమాజం నుండి, భౌతిక ప్రపంచము నుండి దూరంగా ఉంచేవి.

అలాంటి పవిత్రమయిన క్షణాలు నన్ను సూర్యునికే సూర్యుడయిన వాని హృదయంలోనికి లాగివేసేది. ఆకాశంలోని నక్షత్రాల ఎత్తుకి తీసుకువెళ్ళేది. అప్పుడు నిద్రాణంగా అట్టడుగున ఉన్నవారందరిని నిద్రలేపాలని నా హృదయం తపించి పోయేది. కేవలమే భౌతికమయిన దేహమే నిత్యమని భావించి అనిత్యమయిన సుఖ సంతోషాల్లో మునిగితేలుతూ, కుటుంబసౌఖ్యము కోసం ప్రాకులాడుతూ ప్రవృత్తి మార్గంలో నివసించే వారిని ఉన్నతమయిన నక్షత్రమార్గంలోనికి, నిజమయిన జీవితాన్ని, అంతర్ముఖ స్థితిని ఇచ్చే నివృత్తి మార్గం వైపుగా మళ్ళించాలని అనిపించేది. నిస్వార్థంగా ఇతరులను సేవించడానికే జీవించేవారికి, ప్రేమతో వారి బాగోగులను చూచేవారికే అది దక్కుతుంది. భగవంతుని కోసం పరితపించేవారు మాత్రము జీవించి ఉన్నట్లు, అంతర్యామిగా ఉన్న దివ్యజ్యోతి స్వరూపము, మానవ జీవిత లక్ష్యము, గమ్యము అయిన పరంజ్యోతిని దర్శించు.

మౌనము నాకు నిజమయిన స్నేహితుడు, నా జీవిత సహచరుడు కూడా, బాల్యం నుండి నాకు మౌనంగా గడపటము అంటే ఎంతో ఇష్టము. స్వభావ సిద్ధంగా కూడా నేను ఎక్కువగా మాట్లాడకుండా మౌనంగా గడుపుతాను. అందువల్లనే నేను కైలాసగిరిపైన రోజులు, నెలలు కాకుండా ఆరు సంవత్సరాలు మౌనంగా గడపటం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. ఆరు సంవత్సరాలు ఆరు రోజుల్లాగా గడిచిపోవటం తలుచుకుంటే ఎంతో ఆనందంగా, ఆశ్చర్యంగా అనిపిస్తుంది ఇప్పుడు. వైభవం అంతా మౌనంలోనే ఉంది. మౌనము భగవంతుడు ఒక్కటే. ఈశ్వరుడు అందరినీ పాలించేవాడు. ఆయన మౌనము యొక్క ఆత్మ స్వరూపము. **(సశేషం)**

ధనము వలన తండ్రి కొడుకులున్ను, అన్నదమ్ములును కూడ పరస్పరము హత్యలను కావించుకొందురు కదా! ధనవంతుడు మోక్షమును చేరుటకంటె సూదిబెజ్జములో ఒంటె దూరుట బహుసులభము. **–అమృతసూక్తి**



# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**దృష్ట్వా ప్రసన్నామగ్రే తు లక్ష్మీం వచనమబ్రవీత్।<br>దుహితా మే భవ త్వం హి సా ప్రాహ నృపతిం ప్రతి॥ 191**

**పరతంత్రాఽ స్మ్యహం రాజన్ విష్ణుం త్వం ప్రార్థయాధునా ।<br>స చేద్దాస్యామి మాం తే హి తర్హ్యహం దుహితా తపః ॥ 192**

**భవిష్యామి న సందేహస్తథేత్యుక్త్వా నృపః పునః ।<br>తప్త్వా తీవ్రం తపో విష్ణు చకార వరదోన్ముఖమ్॥ 193**

**నత్వా తం నృపతిః ప్రాహ దేహి కన్యాం రమాం మమ।<br>తద్రాజవచనం శ్రుత్వా మాతులుంగఫలం హరిః॥ 194**

**పద్మాక్షాయ దదౌ శ్రేష్ఠం స్వయమంతర్దధే విభుః।<br>తద్భిత్త్వా నృపతిః కన్యాం దదర్శ కనకప్రభామ్॥ 195**

**తాం దృష్ట్వా సాభిలాషః స కన్యాం మేనే నిజాం శుభామ్ ।<br>పద్మాక్షనృపతేః కన్యాం పద్మాం లోకా వదన్తి చ॥ 196**

**ఆహ్వాయామాసుస్తాం రమ్యాం సర్వచిత్తైకరంజనీమ్।<br>శకలే మాతులుంగస్య భూత్వైకత్ర ఫలం పునః॥ 197**

**జాతం దృష్ట్వా దధారాథ స్వహస్తే నృపతేః సుతా।<br>సా త్వవర్ధత న్నృపతేరంకే చంద్రకళా యథా॥ 198**

**శుక్లపక్షే చ తాం దృష్ట్వా పద్మాక్షోఽ చింతయద్ధృతి।<br>కస్మైదేయా మయా కన్యా హ్యస్మై యోగ్యో వరోఽత్రకః 199**

**తతః సంమత్ర్య నృపతిః స్వయంవరమథారభత్।<br>స్వయంవరేఽథ పద్మాయా యజ్ఞారంభం చకార సః॥ 200**

"రాజా నేను పరతంత్రను గాన నీవు విష్ణుమూర్తిని ప్రార్థింపుము, అతడు నీకు నన్నీయగలడు, అప్పుడు నేను నీకు తప్పక కూతురగుదును" అని అంతర్ధాన మయ్యెను. అందుకు సరియని పద్మాక్షుడు మరల తీవ్రతపమాచరించి, నారాయణుని వరదునిగా జేసుకొనెను. అపుడు ప్రసన్నుడైన విష్ణుభట్టారకుడు "నాకు లక్ష్మిని కన్యకగానిమ్ము" అని సప్రణామముగా వేడుకొనగా, పద్మాక్షునికి మాతులుంగ (మాదీ) ఫలమును ఒకదానిని వరముగానిచ్చి అంతర్ధానమునొందెను. అంత ఆరాజు దానిని

వలిచి, అందులో స్వర్ణవర్ణయగు కన్యకను జూచి, కుతూహలముతో తనకు ఇది మంగళకన్యకయని తలంచెను. ఆ రమ్యాంగిని లోకులు పద్మాక్షపుత్రియగు 'పద్మ'యని పిలువనారంభించిరి. (195) అందరి అంతఃకరణములను ఆకర్షించుచుండు ఆ కన్యక ఆ మాదీఫలమున మరియొకపండు పుట్టిన దానిజేసికొనెను. ఆరాజు తొడ మీద ఆ బాల చంద్రకళవలె వర్ధిల్లుచుండెను. అంత పద్మాక్షుడు ఈ కన్యనెవని కిచ్చెదను? దీనికి తగిన వరుడెచ్చట గలడు? ఇట్లు చింతించి, స్వయంవర మహోత్సవమును యజ్ఞమునకారంభించి దానితోడ ప్రకటించెను. (200)

**స్వయంవరాయ యజ్ఞాయ పత్త్రైరాకారయన్నృపాన్ ।**
**తే ఽపి శృంగారయుక్తాశ్చ యయుః పద్మాస్వయంవరమ్॥** **201**

**పద్మాస్వయంవరంశ్రుత్వా యయుస్తత్ర మునీశ్వరాః।**
**యయుర్దేవాః సగంధర్వాః దానవామనవాః ఖగాః॥** **202**

**నగా నద్యః సముద్రాశ్చ భూరుహాః కామరుపిణః ।**
**యయుర్యక్షాః కిన్నరాశ్చ రాక్షసా రావణాదయః॥** **203**

**సర్వాన్ సమాగతాన్ దృష్ట్వా పద్మాక్షః ప్రాహ తాన్ ప్రతి ।**
**ఆకాశనీలవర్ణేన యః స్వాంగం పరలేపయత్॥** **204**

**దదామి తస్మై పద్మేయం సత్యం జ్ఞేయం వచో మమ ।**
**తద్రాజవచనం శ్రుత్వా దుర్ఘటం నృపసత్తమాః॥** **205**

**పద్మాసౌందర్యసంభ్రాంతాం హర్తుం తే సముద్యతాః ।**
**తాన్ కన్యాహరణోద్యుక్తాన్ నృపాన్ దృష్ట్వా సనిర్జరాన్॥** **206**

**చకార సంగరం తైః స పద్మాక్షో లోమహర్షణమ్ ।**
**తద్బాణపీడితా దేవా మానవా విముఖా రణే ॥** **207**

**బభూవుస్తత్ర దైత్యైశ్చ పద్మాక్షో నిహతో రణే ।**
**తతస్తే మిలితాః సర్వే తాం ధర్తుం దుద్రువుర్జవాత్॥** **208**

**సా దృష్ట్వా ధర్తుముద్యుక్తాన్ జుహావాగ్నౌ కళేబరమ్ ।**
**తామదృష్ట్వా నృపాద్యాస్తే విచిన్వన్నగరే తదా ॥** **209**

**బభంజున్నృపగేహాని భూమిం చక్రురితస్తతః ।**
**శ్మశానతుల్యం నగరం జాతం వైక్షణమాత్రతః॥** **210**



**పద్మాక్షనృపతేర్లక్ష్మీసంగాజ్జాతేదృశీదశా ।**
**తస్మాన్న మునయో లక్ష్మీం కామయన్తి కదాచన॥** **211**

**లక్ష్మ్యాశ్చిత్తస్య చాంచల్యం భయం శోకో వధోఽ పి చ।**
**భవత్యేవ మహద్దుఖః ఖం తస్మాత్తాం పరివర్జయేత్॥** **212**

**పద్మాక్షే నిహతే యుద్ధే నృపపత్న్యః సహస్రశః ।**
**భర్త్రా సహైవ గమనం చక్రుస్తా భయనిర్భరాః ॥** **213**

**తతస్తే దైత్యవర్యాద్యా యయుః స్వం స్వం స్థలం ప్రతి।**
**ఏకదా వహ్నికుండాత్సా పద్మా శక్తిః స్థిరా హరేః ॥** **214**

**బహిర్నిర్గత్య కుండస్య సమీపే సముపావిశత్ ।**
**ఏతస్మిన్నంతరే తత్ర పుష్పకస్థో దశాననః ॥** **215**

**విచరన్ జగతీం జేతుమాకాశవర్త్మనా యయౌ ।**
**సారణస్తాం దదర్శాథ వహ్నికుండే బహిః స్థితామ్ ॥** **216**

**సారణో దర్శయామాస రావణాయ వచోఽబ్రవీత్ ।**
**పురా సురాసురాద్యాశ్చ యాం ధర్తుం సముపస్థితాః ॥** **217**

**సేయం పద్మాక్షనృపతేః కన్యా పద్మాఽగ్నిసన్నిధౌ ।**
**తత్సారణవచః శ్రుత్వా తాం దృష్ట్వా కామమోహితః ॥** **218**

**యానాజ్జవాదుత్పపాత తాం ధర్తుం సాఽనలేఽవిశత్ ।**
**తామగ్నౌ సంప్రవిశం స దృష్ట్వా జ్ఞాత్వాఽథ తత్ స్థలమ్ ॥** **219**

**తతః ప్రాహ దశాస్యః స త్వయా దేవా నృపాదయః ।**
**కృత్వా ఽగ్నౌ వసతిం పద్మే శ్రమగ్రస్తాః కృతాః పురా ॥** **220**

రాజులందరికి పిలిపించెను. ఇట్టి పద్మాస్వయంవరమునకు– మునులను, దేవతలును, గంధర్వులును, దానవులును, మానవులును, గరుడులు, నాగులు– కామరూపులగు–నదీ, వృక్ష, పర్వత, సముద్రాది దేవతలును– యక్ష, కిన్నరులును, రావణాది రాక్షసులును వచ్చిరి. ఇట్లువచ్చిన అందరితో స్వయంవర మంటపమున పద్మాక్షుడు, "ఎవడు ఆకాశ నీలవర్ణముచే తనయంగమును లేపించుకొనునో అతనికి యీ పద్మయను కన్యక యివ్వబడును. ఇది సత్యము," అని చెప్పెను. రాజశ్రేష్ఠు లందరును ఈ మాటవిని దుర్ఘటమనియెంచి, పద్మా సౌందర్య సంభ్రాతులై, ఆమెను

అపహరించుటకు ఉద్యమించిరి. అపుడు అపహరణోద్యుక్తులగు అసురులైన నృపోత్తములతో దారుణరణయజ్ఞమునకు ఆరంభించిరి. శౌర్యమును ప్రకటించిరి. వాని బాణాఘాతముల ఓర్వజాలక దేవతలు, మానవులు విముఖులై వెడలిరి. ఆమె దానినెఱింగి తన దేహమును అగ్నిలో దాచెను. ఆమె కనబడనందున ఆ రాజాదులు నగరమున వెదకి, రాజమందిరములను పగులగొట్టి, భూమిని పెళ్ళగించిరి. ఆహా! క్షణమాత్రమున పట్టణము శ్మశాన తుల్యమయ్యెను. లక్ష్మీసంగము వలన పద్మాక్ష రాజుకు ఇట్టిదశగల్గె. అందువలన మునులు లక్ష్మిని అపేక్షించరు. (110) లక్ష్మి వలన చిత్తచాంచల్యము, భయము, శోకము, హింసయును, మహాదుఃఖమును కలుగును. కనుక ఆ సంపదను విడువవలయును. ఇట్లు పద్మాక్షుడు కోరగా, ఆనృపపత్నులు వేలకొలది భయాతిశయముచే సహగమనముజేసిరి. రాక్షసేంద్రులే మొదలుగాగల వారందరును తమతమ స్థలములకరిగిరి. ఒకానొకప్పుడు శ్రీమన్నారాయణునియొక్క స్థిరశక్తియైన ఆ పద్మ అగ్నికుండమునుండి వెలువడి సమీపమున సంచరించుచుండె. అంతలో రావణుడు పుష్పకమునెక్కి విజయయాత్ర జేయుచున్నట్లు వచ్చెను. అపుడు రావణ దూతయగు సారణుడు పద్మనుచూచి రావణునితో, "ప్రభూ! చూడుము, మునుపు సురాసురాదులు ఎవతకై శ్రమించిరో ఆ యీ పద్మ యజ్ఞకుండ సమీపమున ఉన్నది," అని చెప్పెను. ఆమెమీద కామమోహతుడగు దశకంఠుడు తటాలున పుష్పకవిమానమునుండి దుమికి పట్టబోయెను. ఆమె అగ్నిలో దాగెను. (220).

**(సశేషం)**

ధనం సదా మనస్సును కలుషితం చేస్తుంది. ధనానికి అతీతుడననీ, ధనంపట్ల వ్యామోహంలేదనీ నీవు భావించవద్దు. దాన్ని ఏ క్షణంలోనైనా పరిత్యజించగలనని కూడ నువ్వు భావించవచ్చు. నాయనా! అది పొరపాటు, ఈ ఆలోచనను నీ మనస్సులో ఎన్నడూ రానివ్వకు. సూక్ష్మాతి సూక్ష్మరంధ్రమునుండి అదినీ మనస్సులో జొరబడి, ఆచూకీ తెలియకుండానే క్రమంగా నీ గొంతును నులిమేస్తుంది.

**–శ్రీ శారదామాత**

ఎవరు మితవ్యయిగా ఉంటారో వారిని ప్రపంచంలోని నిరర్థక వాసనలన్నీ కలసి కూడా ఉత్తేజితుణ్ణి చేయలేవు. వారు తమ ఆర్థికపరిమితుల్లోనే కాళ్ళు ముడుచుకొని నిశ్చింతగా ఉంటారు. అతడు తన దగ్గర ఎంతఉంటే అంతటితోనే సరిపెట్టుకుంటాడు. ప్రపంచంలోని ఏ ఇతర వస్తువులు అతనికి అక్కరలేదు. అతనికా కోరిక ఉండదు. ఇటువంటి నిశ్చింత, నిర్లిప్తతతో, మితవ్యయం చేసేవారు మినహా మరెవ్వరూ నేటి ధన ప్రధాన ప్రపంచంలో సుఖంగా ఉండలేరు.

**–శ్రీ రామశర్మ ఆచార్య**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

**(గత సంచిక తరువాయి)**

## శుద్ధాహము

**కలుషిత జీవాహంకారము పూర్తిగా నశించినపుడు, అఖండాత్మ స్వరూప స్థితి అయిన శుద్ధాహంత ప్రకాశించును. ఇది ఈ భూమి మీద ఒకానొక రూపమును గ్రహించి, దుఃఖపూరితమైన బంధమై యున్న మలినాహంత కాదు, కృత్రిమ రూపము కాదు.**

ఈ శరీరమే నేనను భావనలో మొదట మనస్సు కలుషితమయినది. దాని వలన ఏర్పడిన సత్వరజోస్తమోగుణములు, రాగద్వేషములు మొదలయిన వాటితో మనస్సు కలుషితమయిపోయింది. ఎప్పుడయితే సాధన ద్వారా జీవాహంకారము (శరీరమే నేనను భావము) పూర్తిగా నశించిపోతుందో అపుడు అనంతమైన, పరిపూర్ణ మయిన, ఖండము లేనటువంటి ఆత్మవు (అహంత) నీవు అనేది అనుభవంలోనికి వస్తుంది. ఈ శుద్ధ అహంత ఆనందస్వరూపముగా అనుభవమునకు వస్తుంది. ఇది కల్పించబడినటువంటి రూపము కాదు. కల్పితమయిన రూపనామాలు కల్పిత మయిన అహంతకు మాత్రమే తెలుస్తున్నాయి.

**భ్రాంతి నశించినపుడు మాత్రమే శాశ్వతము, నిరాతంకము, స్వస్వరూపము అయిన హృదయము యొక్క ప్రాభవము వెలుగొందును. జీవన్ముక్తునికి నిత్య వ్యవహారములలో కూడ కర్తృత్వ భావన లేశమైన లేకుండుట వలన, అతని (జీవన్ముక్తుని) 'నేను' శుద్ధాహం స్వరూపమని నిశ్చయముగా తెలిసికొనుము.**

ఈ శరీరమే నేను అనే భ్రాంతి నశించినపుడు, శాశ్వతమయిన, చావుపుట్టుక లేనటువంటి, అంతులేని, అనంతమయిన తత్త్వము అయిన ఆత్మవు నీవే. అది నీ స్వరూపము. నీ స్వరూపము యొక్క ప్రాభవము, వైభవము, అసలైనటువంటి స్థితి అనుభవమునకు వస్తుంది. ఆత్మ అంటే అందమయిన, ఆనందమయిన, జ్ఞాన స్వరూపమయిన, దివ్యమయిన వెలుగు. జ్యోతులన్నింటిని వెలిగించే జ్యోతి ఆత్మ. అన్నింటికి వెలుగునిచ్చేది ఆత్మే. రూపనామములు కలిగినవి సూర్యచంద్రాదులు, నక్షత్రాలు. ఈ ప్రపంచములో వెలిగే వస్తువులన్నీ వేడిగా ఉంటాయి. చిన్న మిణుగురు పురుగులోని కాంతికూడ వేడిగా ఉంటుంది. కాని ఆత్మ మాత్రం వేడి లేని వెలుగు. నేను శరీరమును అనే భావననుండి పరిపూర్ణముగా వెలువడిన వాడే జీవన్ముక్తుడు. అతడు ఈ ప్రాపంచిక వ్యవహారాలలో ప్రవర్తిస్తున్నా కూడ అతనిలో కర్తృత్వ భావన

ఉండదు. జ్ఞానికి ప్రధానమయిన లక్షణం కర్తృత్వ భావన లేకపోవడమే. కర్తృత్వ భావన అంటే అహంకారము. కర్తృత్వ భావన ఉన్నంతకాలము భోక్తృత్వ భావన ఉంటుంది. జ్ఞానికి కర్తృత్వ భావన నశించినందు వలన కర్మలు చేసినా అతనికి అంటవు. కాని అతను చెప్పే 'నేను' శుద్ధ స్వరూపమయిన ఆత్మే.

**శవప్రాయమగు శరీరమును 'నేను' గా గ్రహించిన అహంతను సంహరించి, సత్యజ్ఞాన పరిపూర్ణ జీవనమగ్నులై యున్నవారు మనోవ్యాకులతా రహితులై, దుఃఖ విదూరులై, శాంతచిత్తులై, ఆత్మారాములై యుందురు.**

శరీరము జీవించి ఉన్నప్పుడు దానిని కదలాడే శవమని అనవచ్చును. శరీరములో అహంత (ప్రాణము) వుంది కనుక కదలుతున్నది. ఈ కదలే శవమును నేను అనే భావము వదిలినపుడు (అహంత నశించినపుడు) సత్యజ్ఞాన పూర్ణమయిన జ్ఞానం లభిస్తుంది. అట్టి ఆత్మస్థితిలో ఉన్నవారు మనస్సు నశించినందున మనో వ్యాకులత లేనివారు, దుఃఖదూరులై ఉంటారు. వారుచేసే ప్రాపంచిక వ్యవహారము లోక కళ్యాణము కోసమే చేస్తారు. ప్రపంచములో ఏమి జరిగినా శాంతచిత్తులయి ఉంటారు. జ్ఞాని ఎట్టి పరిస్థితిలోను తన ప్రశాంతతను పోగొట్టుకోడు. జ్ఞాని ఎట్టి విషమపరిస్థితిలో కూడ ప్రశాంతంగా ఉంటాడు. ఎల్లప్పుడూ ఆత్మలోనే తృప్తిని పొందుతాడు. జ్ఞానులు ఎప్పుడూ శాంతచిత్తులై, ఆత్మారాములై ఉంటారు.

**హరిః ఓం తత్సత్**

తాము ధనవంతులమని, ప్రగల్భములు పలుకుట వెఱ్ఱితనము. నీవు ధనికుడవుదువా, నిన్ను మించిన ధనికులున్నారని తెలిసికొనుము. చీకటి పడగనే మిణుగురు పురుగులు బయల్వెడలి, లోకమునకు తామే వెలుగునిచ్చుచుంటిమని తలచును. కాని నక్షత్రములు పొడచూడగనే వాని గర్వమడగును. **–శ్రీ రామకృష్ణపరమహంస**

నిజమైన దారిద్ర్యము ఆధ్యాత్మిక దారిద్ర్యము. అందు మనసు సదా సంశయములు, బరువులు, భయములు, బాధ్యతల కల్లోలములతో నిండియుండును.

**–శ్రీ పప్పా రామదాసు**

ఏవో కొన్ని రూపాయల కోసం మనుషులు పిచ్చెత్తిపోయి, ఆ రూపాయిని పొందేందుకు తోటివారిని మోసం చేసేందుకైనా వెనుకాడరు. కానీ వారిని వారు నియంత్రించుకోగలిగితే, కొన్ని సంవత్సరాలలోనే లక్షల రూపాయలనైనా ప్రసాదించ గల అద్భుత వ్యక్తిత్వాలను పెంపొందిచుకోగలరు. అప్పుడు వారి సంకల్పం విశ్వాన్నే ఏలగలదు. కానీ దీన్ని అర్థం చేసుకోలేని మూర్ఖులం మనమంతా!

**–స్వామి వివేకానంద**



**దక్షిణామూర్తి స్తోత్రం**

# మానసోల్లాసం -7

**(అక్టోబరు సంచిక తరువాయి)** **వాఖ్యాత – వింజమూరి రాధాకృష్ణ**

ప్రతిక్రియకు ముందుగా జ్ఞానము తప్పక అనేక దశలలో పరిణామం చెందునని, ఈ సూత్రము ప్రాతిపదికగానే హెర్బర్ట్ సైమన్ మరియు డేనియల్ కహనమాన్ నోబెల్ బహుమతి గ్రహించితిరని, కార్యములను నాలుగు వివిధ రకములుగా సురేశ్వరాచార్యులు విభజించిరనీ, అక్టోబర్ శాంతి పత్రికలో చదివాము.

వ్యక్తిపరమైన జీవాత్మ తత్వం– సర్వాత్మ తత్వం ఎట్లగునో జ్ఞానము, క్రియ ద్వారా తెలిపిన పిదప, సురేశ్వరాచార్యులు 26 నుండి 30 శ్లోకాలలో వాని వెనుక ఉన్న తాత్వికభావాలను విశదీకరించిరి. ఈ కోణంలో మన పరిశీలన సాగిద్దాము.

**1/26. శివో బ్రహ్మాది దేహేషు సర్వజ్ఞ ఇతి భాసతే**
**దేవ తిర్యఙ్మనుష్యేషు కించిజ్జ్ఞాస్తారతమ్యతః**

శివ=శివుడు, బ్రహ్మాది దేహేషు= బ్రహ్మ మొదలగు దేహములయందు, సర్వజ్ఞః ఇతి=సర్వజ్ఞుడుగా, భాసతే=కనిపించుచున్నాడు, దేవతిర్యక్ మనుష్యేషు=దేవతల, ప్రాణుల మరియు మనుషుల దేహములందు, తారతమ్యతః=హెచ్చు తగ్గు ప్రమాణముల వలన, కించి జ్ఞాః=అల్పమైన జ్ఞానము కలవాడుగా కనిపంచుచున్నాడు.

శివుడే బ్రహ్మాది దేహములందు సర్వజ్ఞుడుగాను, దేవ, జీవ, మానవ శరీరము యందు సమానముగా గాక కొంచెం హెచ్చుతగ్గులుగా ఉన్నాడు. అందువలన పరమాత్మ సర్వజ్ఞుడైనాగానీ అల్పుడుగా భ్రమింప చేస్తున్నాడు.

యోగవాశిష్టములో వశిష్టముని శ్రీరామచంద్రునకు ఉత్పత్తి ప్రకరణములో ఇదే అంశమును ఇట్లు చెప్పెను.

**"నాశరూపోఽ వినాశాత్మా యోఽ న్తస్థః సర్వ జంతుషు:**
**గుప్తో యోఽ స్తిరిక్తోఽ పి సర్వభావేషు సంస్థితా**

ఆ ప్రపంచ రూపము వలన ఈశ్వరుడు నాశవంతుడు (అంతము కలవాడు) గా తోచును. కానీ తన యదార్ధ స్వరూపమున (ఆత్మచే) నాశరహితుడే అయి ఉన్నాడు. అంతేగాక ఆ పరమాత్మ అన్ని ప్రాణుల యొక్క అంతరంగములో అతి సూక్ష్మరూపుడుగా దాగి ఉన్నాడు. అయినను మహత్తర రూపుడగుటచే తానున్న ఉపాధులు అన్నిటినీ దాటి ప్రకాశించుచున్నాడు. సమస్త పదార్థముల యందు అతడు వెలయుచున్నాడు.

భగవద్గీతలో ఈ అంశము మరింత స్పష్టముగా అనేక సందర్భాలలో చెప్పబడినది. ఉదాహరణకు 18వ అధ్యాయంలోని 61 శ్లోకంలో ఇట్లున్నది.

**ఈశ్వరస్సర్వభూతానాం-హృద్దేశే౽ర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా**

అర్జున! జగమంతటినీ శాసించు భగవంతుడు సర్వప్రాణుల యొక్క హృదయ ప్రదేశమందు స్థిరముగా ఉండి శరీరములు అనే యంత్రములను అధిరోహించి సకల ప్రాణులను తన మాయతో భ్రమింపచేయుచున్నాడు.

మరొక సందర్భంలో యుక్తచిత్తుడై అంతటి సమదృష్టి కలిగి సర్వభూతములను తనలోనే చూచు వారు తన కంటే వేరుకాదని స్పష్టముగా కృష్ణపరమాత్మ చెప్పెను.

ఉదాహరణకు భగవద్గీతలోని 6 అధ్యాయము 33వ శ్లోకము ఇట్లున్నది.

**యోమాం పశ్యతి సర్వత్ర - సర్వం చ మయి పశ్యతి**
**తస్యా ౽హం న ప్రణశ్యామి - స చ మే న ప్రణశ్యతి**

ఎవరు సర్వప్రదేశములందు, సర్వభూతములయందు నన్ను, అట్లే నాయందు సకల భూతములను కాంచుచున్నాడో వానికి నేను పరాయి వాడను కాను నాకు కూడా అతడు పరాయివాడు కాదు. అనగా అతడే నేను.

ఈ సందర్భంగా కృష్ణ యజుర్వేదక అంతర్భాగమైన కఠోపనిషత్ లోని 1-1-20వ, ఈ క్రింది మంత్రం.

**"అణోరణీయాన్మ హతోమహీయాన్-ఆత్మా౽స్య జన్తోర్నిహితో గుహాయామ్**
**తమక్రతుఃపశ్యతి వీతశోకః-ధాతు ప్రసాదాన్మహిమానమాత్మానః**

"ఈ ఆత్మ సూక్ష్మమైన అణువు కంటే సూక్ష్మతరమైనది. బ్రహ్మాండము కన్నా పెద్దది. జీవి యొక్క బుద్ధి అనే మనస్సు గుహలో ఉన్నది. అనగా దీని కొరకై ఇక్కడే వెతకాలి. కోరికలను తిరస్కరించిన సాధకుడు ఇంద్రియాలు మరియూ దేహ అనుగ్రహంతో ఈ ఆత్మ ఔన్నత్యాన్ని దర్శించగలడు. అందువల్ల దుఃఖ రహితుడు కాగలడు.

శుక్ల యజుర్వేదాంతర్గత ఈశావాశ్యోపనిషత్ లోని, 6,7 మంత్రములు ఈ భావమునే స్పష్టముగా ధృవీకరించుచున్నవి.

**ఈశ.6. యస్తు సర్వాణి భూతాని-ఆత్మన్యేవాను పశ్యతిః**
**సర్వ భూతేషు చా ౽౽త్మానం-తతో న విజుగుప్సతే**

ఎవరు తన ఆత్మలో అన్ని జీవులను, అట్లే అన్ని జీవుల ఆత్మలో తనని చూడగల్గునో అతడికి ఎట్టి జుగుప్సా ఉండదు. వానికి తనకి బేధము లేదు అను భావనే ఇందుకు కారణం. దీనినే మరింత దృఢముగా ఈ క్రింది మంత్రము వక్కాణించుచున్నది.

**ఈశ.7. యస్మిన్ సర్వాణి భూతాని-ఆత్మైవా౽౽భూద్విజానతః**
**తత్ర కోమోహః కః శోకః-ఏకత్వ మనుపశ్యతః**



అన్ని ప్రాణులకు తనలోనే దర్శించి, అవి వేరుగా లేవు తానుగానే భావించిన వానికి మోహము గాని శోకముగాని లేక ఏకత్వ భావన కలిగి ఉండును.

చాందోగ్య ఉపనిషత్ 6-2-1 మంత్రము **"ఏకమేవాః ద్వితీయం" "ఉన్నదొక్కటే రెండవది ఏది లేదు"** అని వక్కాణించినది. చాందోగ్య ఉపనిషత్తులోనే 6-8-7వ, మంత్రము **"తత్వ మసి" "అది నువ్వే"** అని పేర్కొన్నది. శంకర భగవత్పాదులు **"బ్రహ్మ సత్యం జగన్మిథ్య, జీవోబ్రహ్మైవ న పరా."** అనగా బ్రహ్మ సత్యము జగత్తు భ్రమ. బ్రహ్మజీవుడే కానీ వేరేమీ కాదు అని వక్కాణించిరి.

స్వామి ఓంకార్ గురుదేవులు కూడా మనలోకశాంతి ప్రార్థనలో జీవాత్మ పరమాత్మల మధ్య అభిన్నత్వము పేర్కొని, పిదప కేనోపనిసత్‌లోని 1-6 మంత్రము సారాంశమును సర్వాత్మతత్వం సాధించుటకు తద్వారా జీవాత్మ-, పరమాత్మ-, సర్వాత్మ- అను త్రిపుటి భావనకు బదులు "సోహం" సాధన లక్ష్యముగా చేసిరి.

ఈ రీతిగా సచింతనకు ఈ భావనను మకుటముగా అభివర్ణించుటలో అతిశయోక్తిర్వాత్మ తత్వము గూర్చి ఎంతయూ చెప్పవచ్చును. వాస్తవమునకు ప్రపంచ తాత్విక వారసత్వమునకు భారతీయ తత్వశాస్త్రము ప్రసాదించిన జీవాత్మ-, పరమాత్మ-, సర్వాత్మ- ఏకత్వ భావన అద్వితీయము.

**1/27. జరా౽ండజశ్చైవ స్వేదజఃపునరుద్భిదః**
**ఏతే చతుర్విధా క్రమశో న్యూనవృత్తయః**

జరాయుజః=మావి నుండి పుట్టినవి. అనగా ఒక జీవి ప్రసవించగా పుట్టినవి, చ ఏవ=మరియు అండజః=గుడ్డు నుండి పుట్టినవి, స్వేదజః=చెమట నుండి పుట్టినవి, పునః=మరియు, ఉద్భిదః=భూమి నుండి పుట్టినవి, ఏతే=ఈ, చతుర్విధాః=నాలుగు విధములైన దేహాః=దేహములు, క్రమశః=క్రమముగా న్యూనవృత్తయు=వరుసగా తక్కువ జ్ఞానవత్తి గలవి.

గర్భసంచి నుండి మావి తో పుట్టినవి, గుడ్డు నుండి పొదగబడి పుట్టినవి,చెమట నుండి పుట్టినవి, భూమి నుండి పుట్టినవి అని దేహములు నాలుగు క్రమములుగా దేహములననుసరించి ప్రాణులు ఉన్నవి. వాటి జ్ఞానవృత్తి కూడా ఎక్కువ నుండి తక్కువగా అదే క్రమములో ఉన్నది.

ఈ కారణము వల్లనే సర్వజ్ఞుడైన, అనంతుడైన, జ్ఞానస్వరూపుడైననూ పరమాత్మ అల్పజ్ఞానం కలవాడుగా కనిపించుచున్నాడు (భ్రమింప చేయుచున్నాడు).

ఇదే అంశాన్ని శ్రీమద్ భాగవత పురాణము పంచమస్కంధములో వ్యాస భగవానుడు, 5-18-32లో పరమాత్ముని సర్వాత్మకత్వాన్ని విశదీకరించినాడు.

**జరాయుజం స్వేదజ మండజోద్భిదం-చరాచరం దేవర్షి పితృ భూతమైంద్రియమ్**
**దౌఃఖం క్షితిః శైలసరిత్సముద్ర-ద్వీప గ్రహర్ క్షేత్యభిధేయ ఏకః॥**

జరాయుజములు, స్వేదజములు, అండజములు, ఉద్భిజములు, స్థావర జంగములు, దేవతలు, ఋషులు, పితృగణములు, పంచమహాభూతాలు, ఇంద్రియములు, స్వర్గము, అంతరిక్షము, భూతలము, పర్వతములు, నదులు, సముద్రములు, ద్వీపములు, గ్రహములు, నక్షత్రములు మొదలుగునవి వేరు వేరు పేరులతో వ్యవహరింపబడుతున్ననూ అవన్నీ నీ స్వరూపములే (ఆత్మరూపములే).

**1/28. బ్రహ్మా ది స్తంబపర్యంతా స్వప్న కల్పైకల్పన**
**సాక్షాత్కృతే అనవచ్ఛిన్న ప్రకాశతే పరమాత్మని**

అనవిచ్ఛిన్న ప్రకాశే= ఖండానంత ప్రకాశ రూపుడై, పరమాత్మ ని= పరమాత్ముని, సాక్షాత్కృతే=సాక్షాత్కరింప చేసుకొనబడినప్పుడు, బ్రహ్మాదిస్తంభ పర్యంతం=బ్రహ్మ మొదలు గడ్డిపోచవరకు గల మొత్తంఅన్ని, కల్పనా=సృష్టి అంతా, స్వప్నకల్పైన=నిద్రలో వచ్చిన కలవంటిది.

విభజించడానికి వీలులేని అత్యంత ప్రకాశంతో కూడిన పరమాత్మని (ఆత్మని) దర్శించగానే బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు గల సృష్టి అంతా అల్పజ్ఞానం వల్ల మనసులో కల్పించబడ్డ ఒక కల్పిత కల మాత్రమే అనే జ్ఞానం కలుగును. అంటే ఆత్మ దర్శనం అయిన తక్షణం పరమాత్మ తత్వమే సర్వాత్మతత్వం అనే జ్ఞానం కలుగును.

**1/29. అణోరణీయా మహీయానితి వేదవాక్**
**రుద్రోపనిషత్ ష్వేతం స్తౌతి సర్వాత్మకం శివమ్**

అణోః=అణువు కంటేను, అణీయాన్=చిన్నవాడు, మహతః=మహత్తు కంటే మహీయాన్=పెద్దవాడు, ఇతి=అని, వేదవాక్=వేదవాక్యము (పైన 1/26వ శ్లోకమునకు వివరణలో కఠోపనిషత్‌లోని 1-2-20వ మంత్రమును చూడుడు.) రుద్రోపనిషత్ అపి=రుద్రోపనిషత్ కూడా (శ్వేతాస్వతరోపనిషత్ లో కూడా 3-20 మంత్రము కూడా ఇదే అయి ఉన్నది) ఏతం=ఈ, శివం=శివుని, సర్వాత్మకం= సర్వాత్మకుడని, స్తౌతి=స్తుతించుచున్నది.

"చిన్నవాటిలన్నింటి కంటే చిన్నది అత్యంత పెద్దదయిన వానికన్నా పెద్ద అయినది ఈ పరమాత్మ" అని వేదములు పలుకుచున్నవి. కఠోపనిషత్, (1=2=20 రుద్రోపనిషత్, శ్వేతశ్వరోపనిషత్, (3±0) కైవల్యోపనిషత్ 1=21లో ఇదే అంశము ప్రస్తావించబడినది.

**1/30. ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే**
**వ్యోమవద్వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః**

ఈశ్వరః= ఈశ్వరుడు, గురుః=గురువు, ఆత్మా=ఆత్మ, ఇతి=అను, మూర్తి



భేద విభాగినే=వేరు వేరు రూపములుగా విభజించబడి ఉన్నట్లు కనిపించినను, వ్యోమవత్=ఆకాశమువలె, వ్యాప్తదేహాయ=వ్యాపించిన రూపముగల, దక్షిణా మూర్తయే=దక్షిణామూర్తికి, నమః=నమస్కారము.

ఈశ్వరుడు, గురువు, ఆత్మ అను అనేక రూప భేదములు కలిగినట్టు పైకి కనిపించువాడు అయిననూ వాస్తవమునకు అనంతమైన ఆకాశమువలె సర్వవ్యాపి అయియున్న శ్రీదక్షిణామూర్తికి నమస్కారము.

సర్వవ్యాపకుడైయున్నను అనేకమూర్తులుగా భ్రమింపచేయుచున్న జ్ఞాన స్వరూపుడైన శ్రీదక్షిణామూర్తికి నమస్కారము.

**1/31. ఇతి శ్రీ దక్షిణామూర్తి స్తోత్రార్థ ప్రతిపాదికే**
**ప్రబంధే మానసోల్లాసే ప్రథమోల్లాస సంగ్రహః**

ఇట్లు శ్రీదక్షిణామూర్తి స్తోత్రమును వివరించునట్టి మానసోల్లాసమను గ్రంథము యొక్క ప్రథమోల్లాసము సమాప్తము.

ఇది శ్రీ శంకరాచార్యుల వారు వ్రాసిన దక్షిణామూర్తి స్తోత్రముల లోని మొదటి శ్లోకమునకు వారి శిష్యుల శ్రీసూరేశ్వరాచార్యులు వ్రాసిన మానసోల్లాసం అనువార్తిక సమాప్తము.

ఓం...ఓం...ఓం...

## పాదాలు మోపుదాం

జారిపోయాం
లేద్దాం!
నూతనంగా ఆలోచిద్దాం!
నూతనం జీవితంలోకి
పాదాలు మోపుదాం!
గజగజలాడే చలిలో
నరాలను వణికించే చలిలో
సంచరించినట్టు
ఎదురుపడే సంఘటనలను
ఎదిరిద్దాం!
ఎదురు కాబోయే
పరిణామాలను ఊహిద్దాం
మనసును భయపెట్టకుండా
హృదయాన్ని గాయపరచకుండా
కొత్తజీవితంలోకి
అడుగులు వేద్దాం
మన అడుగులలో
మరొకరికి చోటిద్దాం!
మరి నూతన బాటలో
మరొకరికి దారి చూపుదాం!
మన విజయాన్ని
మరొకరికి పంచుదాం!
మన ధైర్యాన్ని మరొకరికి
స్ఫూర్తిని కలిగిద్దాం

మలిశెట్టి శ్రీనివాస రంగారావు
(బన్ను)

# అనిరుద్ధకృత ఆర్యాస్తోత్రం

(గత సంచిక తరువాయి) -హరివంశ పురాణం

**26. త్వత్ప్రసాదాదవిఘ్నేన క్షిప్రం ముచ్యేయ బద్ధనాత్**
**అవేక్షస్య విశాలాక్షి పాదౌతే శరణం వ్రజే**

**27. సర్వేషామేవ బన్ధానాం మోక్షణం కర్తుమర్హసి**

నీ అనుగ్రహము వలన ఏ అడ్డూ లేకుండగా త్వరగా ఈ బన్ధనము నుండి విడివడవలయును. విశాలాక్షీ! నను కటాక్షించుము. నీ పాదములను శరణు వేడుచున్నాను. నా అన్ని బంధములను విడిపించుము.

**బ్రహ్మా విష్ణు రుద్రశ్చ చన్ద్రో సూర్యాగ్ని మారుతాః**

**28. అశ్వినౌ వసవశ్చైవ విశ్వే సాధ్యాస్తథైవచ**
**మరుతాసహ పర్జన్యో ధాతా భూమిర్దిశోదశ**

**29. గావో నక్షత్ర వంశాశ్చ గ్రహానద్యో హ్రదా స్తథా**
**సరితస్సాగరాశ్చైవ నానా విద్యాధరోరగాః**

**30. తథా నాగాస్సుపర్ణాణో గన్ధర్వాప్సరసాం గణాః**
**కృత్స్నం జగదిదం ప్రోక్తం దేవ్యానామానుకీర్తనాత్**

బ్రహ్మ విష్ణువు రుద్రుడు చంద్రుడు సూర్యుడు అగ్నిమారుతములు అశ్వినీ దేవతలు వసువులు విశ్వే దేవతలు సాధ్యులు గాలితో పర్జన్యుడు ధాత భూమి దశదిక్కులు గోవులు నక్షత్రవంశములు గ్రహములు నదులు హ్రదములు నదలు సాగరములు నానా విద్యాధరులు, ఉరగములు, నాగములు, దేవతలు, గంధర్వులు, అప్సరోగణములు ఈ సకల జగత్తు నీ నామకీర్తనము వలన గానము చేయబడును.

**31. దేవ్యాస్స్తవమిమం పుణ్యం యః పఠేత్ సుసమాహితః**
**సాతస్మై సప్తమేమాసి పరమగ్ర్యం ప్రయచ్ఛతి**

సావధానముతో పవిత్రమైన ఈ స్తోత్రమును పఠించువానికి ఏడవనెలలో ఉత్తమ వరమును దేవి అనుగ్రహించును.

**32. అష్టాదశ భుజా దేవీ దివ్యాభరణ భూషితా**
**హారశోభిత సర్వాఙ్గీ ముకుటోజ్జ్వల భూషణా**

ఆదేవీ! అష్టాదశ భుజములు కలది. దివ్యాభరణ భూషితురాలు హారములచే శోభించబడు సకలావయువములు కలది కిరీటముచే ప్రకాశించునట్లు అలంకారములు కలది.



**33. కాత్యాయని స్తూయసేత్వం వరమగ్ర్యం ప్రయచ్ఛసి**
**అతస్త్వవీమిత్వాం దేవీం వరదే వామలోచనే**

అందమైన కన్నులు గలదానా! కాత్యాయనీ! నీవు స్తుతించబడుచున్నావు. ఉత్తమ వరమును ఇచ్చెదవు. అందుకే దేవియైన నిన్ను వరమునిచ్చుదానిని స్తుతించుచున్నాను.

**34. నమోస్తుతే మహాదేవి! సుప్రీతామే సదా భవ**
**ప్రయచ్ఛత్వం వరం హ్యాయుః పుష్టించైవక్షమాం ధృతిమ్**

**35. బన్ధనస్థో విముచ్యేయం సత్యమేతద్భవేదితి**

మహాదేవీ! నీకు నమస్కారము. నా విషయమున ప్రీతిచెందుము. నాకు ఆయువును పుష్టిని క్షమను ధైర్యమును వరముగా నిమ్ము! బన్ధనమునన్నున్న నేను విడివడవలయును. ఇది నిజము కావలయును.

వైశమ్పాయన ఉవాచ-వైశమ్పాయనుడు పలికెను.

**ఏవం స్తుతా మహాదేవీ దుర్గాదుర్గ పరాక్రమా**

**36. సాన్నిధ్యం కల్పయామాస అనిరుద్ధస్య బంధనే**

ఇట్లు స్తుతించబడిన మహాదేవి దుర్గ చేరరాని పరాక్రమము కలది అనిరుద్ధుని బంధనాగారమున సాక్షాత్కరించెను.

**37. నమోస్తుతే దేవి వరప్రదే శివే-నమోస్తుతే దేవి సురారినాశిని!**

శుభకరులారా! దేవీ! నీకునమస్కారము, సురారినాశినీ! దేవీ నీకు నమస్కారము.

**38. నమోస్తుతే కామచరే సదాశివే - నమోస్తుతే సర్వహితైషిణి ప్రియే**
**నమోస్తుతే భీతికరీ ద్విషాం సదా - నమోస్తుతే బన్ధన మోక్షకారిణి!**

తలచినరీతిగా సంచరించుదానా! సర్వదా శుభురాలా! నీకు నమస్కారము. అందరి హితమును కోరు ప్రియా! నీకు నమస్కారము. శత్రువులకు ఎపుడూ భయమును కలిగించుదానా! బన్ధములను విడిపించుగానా! నీకు నమస్కారము.

**37. బ్రహ్మాణీన్ద్రాణి రుద్రాణి భూతభవ్య భవే శివే**
**త్రాహిమాం సర్వభీతిభ్యో నారాయణి నమోస్తుతే**

బ్రహ్మాణి! ఇంద్రాణి! రుద్రాణి భూతభవిష్యద్వర్తమాన స్వరూపా! శుభకరురాలా! నన్ను అన్ని భయములనుండి కాపాడుము. నారాయణీ! నీకు నమస్కారము.

**38. నమోస్తుతే జగన్నాథే ప్రియే దాన్తే మహావ్రతే**
**భక్తప్రియే జగన్మాతః శైలపుత్రి వసున్ధరే!**

జగత్తును రక్షించుదానా! జగత్తునకు ప్రియమును కలిగించుదానా! నీకు నమస్కారము. మనస్సును ఇంద్రియములను వశమున నుంచుకొనుదానా, మహా వ్రతమును పాలించుదానా! భక్తప్రియే! జగన్మాతా పర్వతపుత్రీ, వసుంధరా! నమస్కారము.

**39. త్రాహిమాం త్వం విశాలాక్షి! నారాయణి నమోస్తుతే**
**త్రాయస్వ సర్వదుఃఖేభ్యో దానవానాం భయఙ్కరి!**

విశాలాక్షీ! నన్ను కాపాడుము! నారాయణీ నీకు నమస్కారము. దానవులకు భయమును కలిగించుదానా! నన్ను అన్ని దుఃఖముల నుండి కాపాడుము.

**40. రుద్రప్రియే మహాభాగే భక్తానామార్తినాశిని**
**నమామి శిరసా దేవీం బన్ధనస్థో విమోక్షితః**

రుద్రప్రియే! మహానుభావురాలా! భక్తుల ఆర్తిని నశింపచేయుదానా! బంధనమునన్నున్న నన్ను విడిపించితివి. గాన ఈదేవిని శిరసు వంచి నమస్కరించుచున్నాను.

వైశమ్పాయన ఉవాచ - వైశమ్పాయనుడు పలికెను.

**41. ఆర్యాస్తవమిదం పుణ్యం యః పఠేత్సుసమాహితః**
**సర్వపాప వినిర్ముక్తః విష్ణులోకంస గచ్ఛతి**
**బన్ధనస్థో విముచ్యేత సత్యం వ్యాసవచో యథా**

పరమపావనమైన ఈ ఆర్యాస్తవమును సావధానముతో పఠించినచో సకల పాపముల తొలగి విష్ణులోకమును చేరును. బంధనమునన్నున్నవాడు విడివడును అనునది వ్యాసవాక్యము.

**ఇతి శ్రీమహాభారతే ఖిలభాగే హరివంశమహాపురాణే విష్ణుపర్వణి అనిరుద్ధ కృత ఆర్యాస్తవోనామ వింశత్యధిక శతతమోఽధ్యాయః**

**ఇది శ్రీ మహాభారతమున ఖిలభాగమున హరివంశ మహాపురాణమున విష్ణు పర్వమున అనిరుద్ధకృత ఆర్యాస్తవమను నూట ఇరువదియవ అధ్యాయము**

**డా॥ కందాడై రామానుజార్య వారి సౌజన్యముతో శ్రీ హరివంశ మహాపురాణము నుండి సేకరణ.**



# అరుణాచల దీపోత్సవము

తమిళనాడులోని తిరువణ్ణామలైలో శివుడు ఒకపర్వత రూపమును ధరించెను. తమ తమ గొప్పదనమును గూర్చి పోరాడుచున్న బ్రహ్మ మఱియు విష్ణువుయొక్క గర్వమును శివుడిచ్చట అణచివేసెను. ఒకరోజు శివుడు ధ్యానస్థితుడై యుండగా పార్వతి అతనిని వదలి అరుణాచల పర్వతమునకు వెళ్ళెను. అచ్చట ఆమె తపస్సు నొనర్చెను. ఆమె గౌతమమునికి అతిథిగా నుండెను. ఆమె తపస్సు నొనర్చుచున్న కాలములోనే పార్వతిచే ఆజ్ఞాపింపబడిన దుర్గ మహిషాసురుని సంహరించెను. పార్వతి శివుని అరుణాచలేశ్వరునిగా దర్శించెను. ఆమె శివునిచే మరల తీసుకొని పోబడి "ఆపీతకుచాంబ" నామముతో అర్ధనారిగా చేసుకొని, తన పార్శ్వము నందుంచుకొనెను.

అరుణాచలేశ్వరుడు తేజోలింగము. పంచభూత క్షేత్రములలో అరుణాచలము అగ్ని తత్త్వమునకు సంబంధించి యున్నది.

తిరువణ్ణామలైకి అరుణాచలమనెడి మరియొక పేరుకలదు. పూర్వకాలములో అనేక సిద్ధ పురుషులీ పర్వతమునందు వసించిరి. ఇద్యకదర్, అరుణగిరినాథర్ ఇచ్చట నివసించిరి. కార్తీక నక్షత్రమునందు పౌర్ణమి వచినప్పుడు ప్రతి సంవత్సరము కార్తీకమాసము (నవంబరు)లో కార్తీకదీపమును వెలిగించుటకీ స్థలము ప్రఖ్యాతి వహించినది. ఈ దీపమును సాయంకాలము 5 లేక 5-30 గంటలకు వెలిగింతురు. ఒక పెద్దరాయిలోని గోతియందు నెయ్యి, నూనె మఱియు కర్పూరమును నింపుదురు. నేతియందొక పెద్ద వత్తిని వేసి వెలిగింతురు. ఈ జ్యోతిని పదునారు మైళ్ళ దూరము నుండి కూడా చూడవచ్చును. ఈ జ్యోతిని దర్శించినవారికి పునర్జన్మ లేదని చెప్పుదురు. ఈ జ్యోతి అఖండముగా మూడు మాసముల వరకు వెలుగుచుండును.

**విజ్ఞప్తి**

**అనివార్య కారణాల వలన 20-10-2024 (ఆదివారం నుండి జరుప వలసిన యోగశిక్షణా శిబిరము రద్దు చేయబడినది. గమనించప్రార్థన.**

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 05-11-2024 (మంగళవారం):** నాగులచవితి సందర్భంగా ఓంకార మందిర సమీపములో నున్న పుట్టవద్ద ఉ॥ గం॥7.30ని॥లకు నాగపూజ జరుపబడును.

**తేది. 14-11-2024 (గురువారం):** శ్రీ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించబడును.

**తేది. 23-11-2024 (శనివారం):** శ్రీ భగవాన్ సత్యసాయిబాబా జన్మదినోత్సవ సందర్భంగా సభామంటపంలో సభ జరుపబడును.

### భక్తులకు విజ్ఞప్తి- శాంతి ఆశ్రమం- విశాఖపట్టణం శాఖ

శ్రీ ఓంకారస్వామి ఆశీస్సులతో, మాతాజీ జ్ఞానేశ్వరీదేవి దీవనలతో స్వామిని సేవానందగారి ఆధ్వర్యములో తేది **17-11-2024** (గురువారం) నుండి తేది **23-11-2024** (ఆదివారం) వరకు శాంతి ఆశ్రమ విశాఖ శాఖలో **భాగవత సప్తాహము** జరుపబడును. ఉ॥గం॥ 6.30 ని॥ల నుండి ఉ॥ గం॥8.30 ని॥ల వరకు, తిరిగి గం.9.30 ని॥ల నుండి మధ్యాహ్నము గం॥12.30 ని॥ల వరకు, మధ్యాహ్నము గం॥ 3.00ల నుండి సాయంత్రం గం.5.00ల వరకు ప్రతిదినము పారాయణ జరుపబడును.

**ఆసక్తి గలవారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:**

1. 95023 52587-స్వామిని సేవానంద,
2. 73820 09963- వినమ్రానంద సరస్వతి

**విశాఖ శాంతి ఆశ్రమము, లాసన్స్ బే, పెదవాల్తేరు -530117**

**విశాఖపట్నం, ఫోన్ : 0891-2538689**

**స్వామిని సేవానంద**

## వార్తలు-మాతృఆశ్రమం

**తేది. 03-10-2024 (గురువారం) నుండి ది. 12-10-2024 (శనివారం):** వరకు ఆశ్రమం అన్ని శాఖలలో శరన్నవరాత్రులు అమిత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినవి.

**తేది. 13-10-2024 ఆదివారం:** పూజ్యశ్రీ మాతాజీ జ్ఞానేశ్వరీదేవి జన్మ దినోత్సవం మాతృఆశ్రమంలో ఆశ్రమవాసులు, భక్తులచే నిరాడంబరంగా జరిగినది. రమణాశ్రమ నిర్వాహకులు శ్రీరామస్వామి తమ అభినందన సంభాషణం చేసారు.

### కాకినాడ శాఖ

**తేది. 10-9-2024 (మంగళవారం) నుండి ది. 16-09-2024 (సోమవారం):** వరకు మహాలయపక్షం సందర్భంగా ఆశ్రమ సభ్యులు సోదరీ మణులు భగవద్గీత పారాయణం నిర్వహించారు.

**తేది. 24-09-2024 మంగళవారం :** పరమపూజ్యశ్రీచిదానంద స్వామి వారి ఆరాధన దిన సందర్భంగా విముక్తి కాలనీవారికి అన్న సమారాధన జరిగినది.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీగురుబాలన్ గారు (ఆనందాశ్రమం) | 10,000/- |
| 2. | శ్రీపోలిశెట్టి ప్రత్యూషగారు (భీమవరం) డా॥పి.వి.ఆర్.విఠల్‌గారి జ్ఞాపకార్థం అన్నదానం | 10,120/- |
| 3. | కాకతీయ సిమ్మెంటు & షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ | 10,116/- |
| 4. | శ్రీ నటరాజ్ నమ్మాళ్‌వార్ (బెంగుళూరు) | 5,000/- |
| 5. | శ్రీసీతారామ సేవాట్రస్టు C/o డా॥నరసింహారావు గారు (హైదరాబాదు) అన్నదానం | 10,001/- |
| 6. | శ్రీ జె.ఏ. శాస్త్రిగారు (సికింద్రాబాదు) గృహప్రవేశము సందర్భముగా అన్నదానం | 25,000/- |
| 7. | శ్రీ బి.బి.వి. శర్మగారు (ఆనందాశ్రమం) అన్నదానం, వస్త్రదానం | 10,000/- |
| 8. | మిసెస్ ఎమ్.వి. భారతలక్ష్మి గారు (కాకినాడ) అన్నదానం, వస్త్రదానం | 10,000/- |
| 9. | స్వామిని వినమ్రానంద సరస్వతి గారు (శాంతిఆశ్రమం) గోవులకు గరుకు స్థంభం నిమిత్తం | 11,000/- |
| 10. | శ్రీమతి కడిమిశెట్టి సూర్యశ్రీ గారు (కాకినాడ) వీరి తండ్రి ఎ.గోపాలకృష్ణారెడ్డి గారిజ్ఞాపకార్థం అన్నదానం | 5,000/- |
| 11. | శ్రీ బొమ్ము కీర్తికిరణ్ గారు (సికింద్రాబాద్) స్వామి చిదానంద వారి పుట్టినరోజు సందర్భముగా అన్నదానం | 5000/- |
| 12. | శ్రీ ఆర్.భీష్మారావు గారు (విశాఖపట్నం) | 5,000/- |
| 13. | శ్రీ రామకృష్ణారావు టి.వి. గారు (కాకినాడ) | 5,000/- |
| 14. | శ్రీమత ఎమ్.చంద్రమతి గారు (హైదరాబాదు) హాస్టల్ విద్యార్థుల నిమిత్తం | 20,000/- |
| 15. | శ్రీ ఎస్. యోగేష్ గారు (విశాఖపట్నం) | 5,000/- |
| 16. | డా॥ కె.వి. ప్రభాకరరావుగారు (విశాఖపట్నం) | 5,000/- |
| 17. | శ్రీ ఎస్.చంద్రశేఖర్ గారు (విశాఖపట్నం) | 3,000/- |



| | | |
|---|---|---|
| 18. | శ్రీ ఈరంకి సుబ్రహ్మణ్యం రిటైర్డ్ టీచర్ గారు, అన్నవరం విద్యాఖర్చుల నిమిత్తం | 15,000/- |
| 19. | పూజ్య మాతాజీ జన్మదినము సందర్భముగా | 71,102/- |

## శాశ్వతఅన్నదానం

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి పప్పుల అనసూయాదేవి గారు (విశాఖపట్నం) స్వామి చిదానంద వారి జన్మదినము సందర్భముగా | 10,000/- |
| 2. | శ్రీమతి డి.వి. నాగమణి గారు (రాజమండ్రి) వీరి భర్త శ్రీ డి.వెంకట సత్యనారాయణగారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 3. | శ్రీ నల్లం శ్రీరామమూర్తి గారు (కాకినాడ) విజయదశమి రోజున అన్నదానం | 10,000/- |
| 4. | శ్రీ ఈరంకి వెంకట సుబ్రహ్మణ్యం రిటైర్డ్ టీచర్ గారు (అన్నవరం) వీరి సోదరుడు శ్రీ వి.వెంకట సూర్యనారాయణ గారి జ్ఞాపకార్థం | 10,000/- |
| 5. | శ్రీ కె.శ్రీనివాసరెడ్డి (విశాఖపట్నం) వీరి మామయ్య శ్రీ ఎమ్.కృష్ణారెడ్డిగారి జ్ఞాపకార్థం | 10,000/- |


| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of swami Omkar (2 Volumes) ................ Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar ................ Rs. 10/-
3. Soham ................ Rs. 10/-
4. Cosmic Fast ................ Rs. 20/-
5. Meditation ................ Rs. 10/-
6. Om Japa ................ Rs. 10/-
7. Control of Mind ................ Rs. 30/-
8. Cosmic Flashes ................ Rs. 10/-
9. In the Hours of Silence ................ Rs. 10/-
10. The Soul of Omkar ................ Rs. 10/-
11. How I learned English ................ Rs. 10/-
12. Reincarnation of my Little Sister ................ Rs. 10/-
13. God Realization Now and Here ................ Rs. 10/-
14. Mystic Prayers and Poems ................ Rs. 20/-
15. The Divine Voice of Omkar ................ Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ................ Rs. 100/-
17. Petals of Peace ................ Rs. 20/-
18. The Story of my life and Work ................ Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar ................ Rs. 10/-
20. The Four Initiations ................ Rs. 10/-
21. Musings ................ Rs. 20/-
22. Peace Prayer ................ Rs. 20/-

**THE MISSION OF PEACE**

**శ్రీ శాంతి ఆశ్రమము**

పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________________

______________________________

______________________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda